# ఎటు పోతోంది లోకం ?

- కె. లక్ష్మీకాంతమ్మ



కానీ

నా మంచి తనం ఈ రోజు చేత గాని తనం గా మారి పోయింది.

అవును...

వాడు...

పోలయ్యగాడు... నా మంచితనం మీద దారుణంగా దెబ్బకొట్టాడు.

ఇలా అవుతుందని ఏనాడూ వూహించలేదు. నీతి నిజాయితీలను, మంచితనాన్నీ నమ్మినవాణ్ణి. నాకు ఇలాంటి దారుణమైన పరిస్థితి ఎదురవుతుందని అస్సలు అనుకోలేదు.

నా చేతికి ఎముకలేదన్నారు... నేను దానాలు తెగబడి ఏమీ చేయలేదు. కానీ నా వద్ద పనిచేసే వాళ్ళకు ఇబ్బంది కలగకుండా... చేయి విదిలించి జీతాలిచ్చాను.

వాళ్ళందరూ నాకు కృతజ్ఞులై వుంటారని కూడా నేననుకోలేదు. ఇదే మంచితనం అనుకొన్నాను. ఎందుకోగానీ చిన్నప్పటి నుండీ.. నాకు మంచివాడిగా పేరు తెచ్చుకోవాలనే కాంక్ష అధికం.

అందుకే... వీలయినంత వరకు మంచి పనులే చేస్తూ వచ్చాను.

నా షాపు పక్కన సత్తిరెడ్డి హోటల్‌లో క్లీనరుగా చేరిన. పదేళ్ళ పోలయ్య... ఒకనాడు నా పరువు- ప్రతిష్ఠలను మంట గలపగలడని నేనేనాడూ వూహించలేదు.

ఆ పోలయ్య... సత్తిరెడ్డి హోటల్‌లో చేరి

నెలరోజులైంది. ఒకరోజు నేను నా కిరాణం షాపు మూశాక వాడిని చూశాను. వాడు చిరిగిన నిక్కరు, బనియన్‌తో... హోటల్ అరుగుపై కూర్చుని ఏడుస్తున్నాడు. హోటల్ పై అంతస్థులో వుంది. "ఒరేయ్... ఏం జరిగిందిరా?" అడిగాను. వాడు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

"పోలయ్యా... ఏం జరిగింది? ఎందుకేడుస్తున్నావ్?" అని అడిగాను మళ్ళీ.

" మా అమ్మ... మా అమ్మకి జొరంగా వుందన్నా... జొరమంటే జొరం కాదు... నొప్పి... బాధ... మెలికలు తిరిగి పోతా వుంది. మా సేటుని డబ్బులడిగితే ఇవ్వనన్నాడు. నేను చేసిన పనికి ఏరోజు కారోజు డబ్బులు ఇచ్చేస్తున్నాడు.. కానీ ఒక్క వంద రూపాయలడిగానన్నా... ఇయ్యనంటున్నాడు..." ఏడుస్తూ చెప్పాడు.

" ఈ విషయం సత్తిరెడ్డితో మాట్లాడి తేల్చుకుందాం..." అనే ఆలోచన నాక్కలగలేదు. కలగదు కూడా.. ఎందుకంటే నాకు గొడవలంటే అస్సలు పడదు. ఎవరి విషయంలోనూ జోక్యం చేసుకోను.

కానీ పోలయ్యను చూస్తుంటే మాత్రం ఎందుకో బాధనిపిస్తోంది.

పాపం... వాడి తల్లి ప్రాణాలు కాపాడు కోవాలని వాడికెంత తపనగా వుందో!

"పోలయ్యా! ఇప్పుడు నువ్వు హోటల్ కెళ్ళవా?" అని అడిగాను.

"లేదన్నా... ముందు మా యమ్మను కాపాడుకోవాల" అన్నాడు వాడు.

వెంటనే ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాను. పనివాళ్ళని వెళ్ళిపొమ్మని చెప్పాను.

"పోలయ్యా... మీ ఇంటికెళదాం పద" అన్నాను. వాడు ఆనందంగా చూస్తూ "అన్నా నువ్వొస్తావా మా యింటికి!" అన్నాడు.

"వస్తాను పద..." అన్నాను.

వాడు సంతోషంగా బయలుదేరాడు. సందులు గొందులూ తిప్పుతూ నన్ను ముందుకు తీసుకెళుతూనే వున్నాడు.

సుమారు ఇరవై నిముషాల తర్వాత ఒక పూరిపాక ముందు ఆగి..." ఇదే అన్నా... మా ఇల్లు" అన్నాడు.

"అయితే పద" అన్నాను.

వాడు నన్ను తీసుకుని వెళ్ళి లోపల ఒక కుర్చీలో కూర్చుండబెట్టాడు.

"సార్... లోపల మా అమ్మవుంది... ఇప్పుడే వస్తాను." అంటూ లోపలికెళ్ళాడు.

కానీ వాడెంతకూ తిరిగిరాలేదు.

నాకు అసహనంగా వుంది. అనుమానంగానూ వుంది. పది నిముషాలు... ఇరవై నిముషాలైంది. అక్కడ ఏ అలికిడీ లేదు.

"పోలయ్యా... పోలయ్యా" అని పిలుస్తూ లోనికి అడుగు పెట్టాను.

ఎవరో ఒక ఆడమనిషి... నన్ను బలంగా లాగి మంచంపై పడేసింది. ఆ తరువాత తానూ నాపై విరుచుకు పడింది.

నా అణువణువునూ స్పృశిస్తూ నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. ఆఖరుకు ఏం జరుగుతున్నదో తెలియకుండానే... నేను ఆమెతో శారీరక సుఖాన్ని పంచుకున్నాను.

ఒక అయిదు నిముషాల తర్వాత... గుడిసె బయట దీపాలు వెలిగాయి.

అలజడి...

ఎవరో కొందరు... అరుస్తూ, కేకలేస్తూ... గుడిసెలోకి దూసుకువచ్చారు.

"రేయ్... ఎవడ్రా అదీ... ఆడకూతురిపై దౌర్జన్యం చేస్తావా... పద పోలీస్ స్టేషనుకి..."

లోపల బుడ్డి దీపం వెలిగింది. ఆ ఆడది మంచం పక్కనే నిలబడి చీర నిండుగా కప్పుకుని ఏడుస్తోంది.

అంతలో పోలయ్య స్వరం వినిపించింది...

"అమ్మా... అమ్మా... ఈ అన్న మంచోడనుకున్నా... అమ్మా అమ్మా... ఇట్లా చేస్తాడనుకోలేదు."

వాడు ఆమెని కరుచుకుపోతున్నాడు.

ఓహో... అయితే ఆమె పోలయ్య తల్లి అన్న మాట...

ఎవరో నన్ను బలంగా ఈడ్చుకు వచ్చి గుడిసె బయట వున్న మంచంలో కుదేశారు.

"ఎందుకిట్టా జేశావు... మర్యాదగా ఆయమ్మ కాళ్ళు పట్టుకుని అయిదు వేలు చెల్లించుకుని వెళ్ళిపో... లేదంటే నీ మీద అత్యాచారం కేసు పెట్టి లోపలేయిస్తాం" అంటున్నారెవరో.

ఏమని చెప్పగలను! ఇదంతా ఒక కుట్రని నాకు తెలుసు. వాళ్ళంతా ఒకే గాంగ్ వాళ్ళని నాకు తెలుసు. వాళ్ళని ఎదురిస్తే నాకే ప్రమాదమనీ తెలుసు.

అందుకే మెళ్ళో వున్న బంగారు చెయిన్ తీసి ఆమె చేతిలో పెట్టాను.

"ఇదిగోమ్మా... మంచితనాన్ని నిలబెట్టా లనుకుని నేను నష్టపోయిన సొమ్మే. తీసుకో... ఈ డబ్బుతో నువ్వెన్నాళ్ళు హాయిగా వుంటావో తెలీదు గానీ... నాకు మాత్రం చక్కని గుణపాఠం నేర్పించావు. ఇంక ఈ జన్మలో మంచితనం జోలికి పోను." అంటూ అక్కణ్ణుంచి పరుగు తీసాను. *

100% AYURVEDIC PRODUCT
గ్యాస్‌ట్రబుల్‌తో బాధపడుతున్నారా?
మలబద్ధకము తో
ఇబ్బంది పడుతున్నారా?
కడుపునొప్పి మొదలగు జీర్ణశక్తికి సంబంధించిన వ్యాధులకు అనేక సంవత్సరముల నుండి ప్రయోగములు చేసి చంద్రికా వారిచే తయారుచేయబడినటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మందు
క్యాప్‌జైమ్
చూర్ణము


జీర, ఇంగువ, సైంధవలవణం, యవాక్షారము, ఇసఫ్‌గోల్, మారీచము మొదలగు అనేక రకములైనటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మూలికలతో తయారుచేయబడినది.
ఈ క్యాప్‌జైమ్ చూర్ణమ్ తీసుకొనుట వలన ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావు
మార్కెట్ చేయువారు
రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కో.
పార్కురోడ్, విజయవాడ - 1. ఫోన్: 2424133.